రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

క్లుప్తంగా

రిపబ్లిక్ వేడుకల్లో ఎన్‌సీసీ విద్యార్థులు



విజయవాడస్పోర్ట్స్: ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన 110 మంది ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నట్లు వింగ్ కమాండెంట్ అజిత్‌సింగ్ రాటి, కల్నల్ ఎస్‌కే తన్వర్ తెలిపారు. వేడుకల్లో భాగంగా జరిగిన పరేడ్‌లో విద్యార్థులు పాల్గొని అద్భుత ప్రదర్శన ఇచ్చినట్లు తెలిపారు. పది రోజుల పాటు కఠోర శిక్షణ తీసుకుని ఈ ప్రదర్శన ఇచ్చినట్లు తెలిపారు. పిల్లల్లో క్రమశిక్షణతో కూడిన దేశభక్తి పెంచేందుకు ఈ ప్రదర్శన దోహదపడుతుందని పేర్కొన్నారు.

కళాకారులు సాంస్కృతిక వారధులు



విజయవాడ కల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారధులని స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ బీ ఆశయ్య అన్నారు. రాగలహరి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఆశీష్ స్టూడియోలో సినీ సంగీత విభావరి, సాంస్కృతిక సంస్థల నిర్వాహకులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆశయ్య మాట్లాడుతూ దేశ సంస్కృతిని కాపాడేది సాంస్కృతిక ప్రదర్శనలేనన్నారు. రాగలహరి సంస్థ వ్యవస్థాపకురాలు సత్యస్వాతి మాట్లాడుతూ రాగలహరి వేదికగా అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తునట్లు తెలిపారు. ఆశయ్యను, సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరు విజయలక్ష్మిని నిర్వాహకులు సత్కరించారు. గాయకులు పలు తెలుగు చిత్రగీతాలను ఆలపించారు.

రాజీవ్‌నగర్‌లో ఎన్‌జీఓ సంస్థ చేయూత

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక రాజీవ్‌నగర్‌లో హైదరాబాద్‌కు చెందిన యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ వరదలు సంభవించిన సమయంలో నిరాశ్రయులైన పేదలకు ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించింది. సుమారు 70 కుటుంబాలకు పండ్లు, కూరగాయలు విక్రయించుకునే మొబైల్‌బండ్లు, కిరణా సామాగ్రి, పంక్చర్‌షాపు సామాన్లు, మెకానిక్‌షాపు సామాన్లు, బార్బర్‌షాపుల సామాగ్రి, టీ స్టాల్ సామాన్లు, టిఫిన్ సెంటర్ల సామాన్లు, టైల్స్ మేస్త్రీలకు సామాగ్రి కలిపి రూ. 15లక్షల విలువ చేసే సామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ సంస్థ ప్రతినిధులు సీఈఓ రేఖా శ్రీనివాసన్, సీనియర్ మేనేజర్ భరత్ మెరుగు, మేనేజర్ కందురి రాములు, తవిటి ప్రశాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన బ్రెయిలీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయీ బ్రెయిలీ అని న్యూ లైఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫర్ ద బ్లైండ్ అధ్యక్షుడు జి.సీతారామస్వామి అన్నారు. ఆదివారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో న్యూ లైఫ్ వెల్ఫేర్ ఫర్ ది బ్లైండ్ ఆధ్వర్యంలో బ్రెయిలీ 216వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రెయిలీ లిపి ద్వారా అంధుల జీవితాల్లో వెలుగులు నింపితే.. రాజ్యాంగం ప్రత్యేక హక్కులు కల్పించిందన్నారు. ప్రస్తుతం దివ్యాంగులు అనుభవిస్తున్న సౌకర్యాలు, హక్కులు అన్నీ పోరాటాల ద్వారానే సాధ్యమైందన్నారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ అమలు చేయడం జరుగుతోందన్నారు. న్యాయవాది రవీంద్రబాబు చట్టాలను వివరించారు. కార్యక్రమంలో ఒ. రమేష్, ఉపాధ్యక్షుడు, వి.కృష్ణమూర్తి, జనరల్ సెక్రెటరీ కె. సి.హెచ్ రెడ్డి, జి.జ్యోతి, కోశాధికారి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు వీఎంసీలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పటమట(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించేందుకు విజయవాడ నగరపాలకసంస్థ ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో కార్యక్రమం జరుగుతుందన్నారు. నగర వాసులకు వీఎంసీ కల్పిస్తున్న మౌలిక వసతుల్లో సమస్యలను అధికారులకు నేరుగా ఫిర్యాదు చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులు ఫిర్యాదులను స్వీకరిస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాడవాడలా ఘనంగా గణతంత్ర వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నగరంలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. స్థానిక ముత్యాలంపాడు ప్రభుత్వ ముద్రణాలయంలో ఆదివారం గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ ముద్రణాలయం డీజీఎం ఎల్. మోహన్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా గణతంత్ర దినోత్సవ విశిష్టతను వివరించారు. నాయకులు నాగవరపు శరత్‌చంత్, నాతి సీతారామరాజు, వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఎస్‌పీఎఫ్ ఏఎస్ఐ భానుప్రకాష్‌రెడ్డి సిబ్బందితో కలిసి గౌరవ వందనం చేశారు. అలాగే గులాబీతోటలో అమరావతి వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు జెండా వందనం చేశారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, మథర్ థెరిస్సా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. డిస్ట్రిక్ట్ వాకర్స్ ఐపీడీజీ చిన్నం రామకృష్ణ, వీరమాచనేని కిషోర్, క్లబ్ అధ్యక్షుడు బండారు వెంకటేశ్వరరావు, కే రాము పాల్గొన్నారు. స్పందన సేవాసమితి స్పందన వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన జరిగిన వేడుకల్లో డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకుడు వసంతకుమార్ జెండా వందనం చేశారు.

పశుసంవర్థక శాఖ కార్యాలయంలో..

ముత్యాలంపాడు పశు సంవర్థక శాఖ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మద్ది హనుమంతరావు జెండా వందనం చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ స్వామి పాల్గొన్నారు. ముత్యాలంపాడులో జరిగిన వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష వేళంగిణి మాత చర్చి ఫాదర్ రెవరెండ్ శేఖర్‌తో కలిసి జెండా వందనం చేశారు. మాచవరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ ప్రాంతీయ కార్యాలయంలో వర్శిటీ ఓఎస్‌డీ డాక్టర్ వెలగా జోషి డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం. అజంత కుమార్‌తో కలిసి జెండా వందనం చేశారు. ప్రాంతీయ అధ్యయన కేంద్రం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి జెండా వందనం చేశారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా పాల్గొని జెండా ఎగురవేశారు. హెచ్‌ఎం పరసా వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు ఎండీ హాఫీజుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 58వ డివిజన్ సింగ్‌నగర్ రిజ్వాన్ మసీదు ఎదురుగా ఉన్న ఆజాద్ ముస్లిం కమిటీ దిమ్మె వద్ద జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా జాతీయ జెండా ఎగురవేశారు. ఆ కమిటీ మహిళా విభాగం నగర ప్రధాన కార్యదర్శి గుల్‌నాజ్ బేగం, ఏఎంసీ నాయకులు షేక్ సాజిద్ అలీ, ఎండీ కాలేషా, ముస్లిం మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.



వీఎంసీ ప్రధాన కార్యాలయంలో గాంధీ, అంబేడ్కర్ చిత్ర పటాల వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్

ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం

పటమట(విజయవాడతూర్పు): ప్రజలందరికీ స్వేచ్ఛ, న్యాయం, సమానత్వం, ఉండాలని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. తొలుత ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి వీఎంసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, గాంధీ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం మనకు భిన్నత్వంలో ఏకత్వాన్ని గుర్తు చేస్తుందని అన్నారు. అనంతరం మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధుల ఐకమత్యంతోనే నగరాభివృద్ధి సాధ్యమన్నారు. గణతంత్ర దినోత్సవం కేవలం వేడుకలకు మాత్రమే కాదని, మన రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలను గుర్తు చేస్తుందని అన్నారు. అనంతరం ఎన్‌సీసీ, ఆర్మీ, నేవీ, వాయు దళాల విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం వీఎంసీలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించిన ఉద్యోగులు, కార్మికులకు ప్రతిభా పురస్కారాలు, ప్రశంశ పత్రాలను అందించారు. డెప్యూటీ మేయర్ అవుతు శైలజ, టీడీపీ ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి, సీపీఐ ఫ్లోర్ లీడర్ సత్తిబాబు, కార్పొరేటర్లు శర్వాణీమూర్తి, ఉమ్మడి చంటి, జాస్తి సాంబశివరావు, షాహినా సుల్తానా, చెన్నగిరి రామ్మోహన్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగం ప్రతి ఒక్కరికి మార్గదర్శకం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): భారత రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి మార్గదర్శకమని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా ఆదివారం సత్యనారాయణపురం గాయత్రీ కల్యాణ మండపం వద్ద ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీమూర్తి, నాయకులు ఈశ్వర్, దోనెపూడి శ్రీనివాస్, చాంద్‌శర్మ, సనత్, చల్లా సుధాకర్, ఫణి, రాజశేఖర్ పాల్గొన్నారు. అలాగే చిత్తరంజన్ గ్రంథాలయంలో జరిగిన వేడుకల్లో గ్రంథాలయ అధికారి సంపత్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు. సెయింట్ జాన్స్ స్కూల్ గణతంత్ర వేడుకల్లో రిటైర్డ్ సుబేదార్ గంగాధరరావు పాల్గొని జెండాను ఆవిష్కరించారు.



గాయత్రి కల్యాణ మండపం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

ఇంద్రకీలాద్రిపై గణతంత్ర వేడుకలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై గణతంత్ర వేడుకలను నిర్వహించారు. దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వద్ద నిర్వహించిన వేడుకలకు ముఖ్యఅతిథిగా డీఈవో రత్నరాజు హాజరయ్యారు. తొలుత భరతమాత, గాంధీజీ, దుర్గమ్మ వారి చిత్రపటాలకు పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎస్‌పీఎఫ్, హోంగార్డుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఆలయ ఏఈవోలు, సూపరింటెండెంట్లు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో గ్రంథాలయాధికారి కె. రమాదేవి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. రామమోహన గ్రంథాలయంలో గ్రంథాలయ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. గ్రంథాలయ ఉపాధ్యక్షుడు దమ్మాల రామచంద్రరావు, కార్యదర్శి వీ కేశవరావు, సహాయ కార్యదర్శి టీ రఘురాం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. దామోదరం సంజీవయ్య సేవాదళం ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు పెజ్జోనిపేటలో నిర్వహించారు. ఫాదర్ జేమ్స్ ధైర్యానంద్, మల్లెల సురేష్, సుజాత దాస్ పాల్గొన్నారు. గవర్నర్‌పేటలోని సీవీఆర్ స్కూల్, సూర్యారావుపేటలోని కర్నాటి రామ్మోహన్‌రావు స్కూల్‌లో వేడుకలు నిర్వహించారు.



ప్రభుత్వ ముద్రణాలయంలో గౌరవ వందనం స్వీకరిస్తున్న డీజీఎం మోహన్‌కుమార్

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 64వ డివిజన్ బీవీ సుబ్బారెడ్డి ఎలిమెంటరీ, హైస్కూల్‌లలో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ జెండా ఆవిష్కరణ చేశారు. హెచ్‌ఎంలు దుర్గారావు, హనుమంతరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్కూల్ కమిటీ ఛైర్మన్లు పాల్గొన్నారు. 63వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పీవీ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు నాగిరెడ్డి, ఎం.జగదీష్, రమణారెడ్డి, రాజు, గోపి, కమలేష్, యేసు పాల్గొన్నారు.

ఏపీ రాష్ట్ర పోలీస్ కంప్లైట్స్ అథారిటీ కార్యాలయంలో..

విజయవాడస్పోర్ట్స్: విజయవాడ శివారు కానూరులోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ కంప్లైట్స్ అథారిటీ కార్యాలయంలో ఆదివారం గణతంత్ర దినోత్సవాలు నిర్వహించారు. వేడుకల్లో అథారిటీ చైర్‌పర్సన్, విశ్రాంత న్యాయమూర్తి జె.ఉమాదేవి పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీస్ కమిషనరేట్ కార్యాయలంలో జరిగిన వేడుకల్లో పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు జాతీయ జెండాను ఆవిష్కరించి జెండా వందనం చేశారు. డీసీపీలు మహేశ్వరరాజు, తిరుమలేశ్వరరెడ్డి, ఉదయరాణి, మనీషా, కృష్ణమూర్తి నాయుడు, ఎస్.వి.డి.ప్రసాద్ పాల్గొన్నారు. జిల్లా ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో డెప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(డీటీసీ) ఎ.మోహన్ జెండా ఆవిష్కరించారు. ఆర్టీవోలు ప్రవీణ్, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, జి.వి.ఎస్. ఎస్.మూర్తి, కె.శివరామ్‌గౌడ్, ఏపీ రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు, కార్యాలయ ఏవోలు అబ్దుల్‌సత్తార్, చంద్రకళ, కానిస్టేబుల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.భద్రాచలం పాల్గొన్నారు.



జెండా వందనం చేస్తున్న ఏపీ రాష్ట్ర పోలీస్ కంప్లైట్స్ అథారిటీ చైర్‌పర్సన్ రిటైర్డ్ జడ్జి ఉమాదేవి



డీటీసీ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న డీటీసీ ఎ.మోహన్, ఆర్టీవోలు



అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ ప్రాంతీయ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న డాక్టర్ వెలగా జోషి



ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో గణతంత్ర వేడుకలు



జాతీయ జెండాను ఎగురవేసిన నాగుల్‌మీరా, ముస్లిం మైనార్టీ పెద్దలు



64వ డివిజన్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ



ఇంద్రకీలాద్రిపై జెండావిష్కరణ చేస్తున్న డీఈవో రత్నరాజు, ఆలయ అధికారులు

ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను నాశనం చేశారు

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): దావోస్ వేదికగా ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను కూటమి నేతలు సర్వనాశనం చేశారని వైఎస్సార్ సీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. సత్యనారాయణపురం గాయత్రి ఫంక్షన్ హాల్ వద్ద ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి నేతలు రాష్ట్రాన్ని తిరోగమనం దిశగా తీసుకువెళ్తున్నారని విమర్శించారు. పబ్లిసిటీ కోసం విపరీతంగా ఖర్చు చేసి దావోస్‌లో ఒక చిన్న కంపెనీతో కూడా ఒప్పందం చేసుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దావోస్ వెళ్లిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.1.26 లక్షల కోట్లకు ఎంఓయూలు కుదుర్చుకొచ్చారని గుర్తు చేశారు. విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రూ.13.5 లక్షల కోట్లకు ఎంఓయూలు చేసుకున్నట్లు వెల్లడించారు. వాస్తవాలు ఈవిధంగా ఉంటే గవర్నర్ ప్రసంగం మాత్రం పూర్తి భిన్నంగా సాగిందని మల్లాది విష్ణు అన్నారు. రిపబ్లిక్ డే వేడుకల్లో గవర్నర్ మాట్లాడిన మాటలు పూర్తిగా సత్య దూరమన్నారు. రాష్ట్రంలో ఎక్కడా ఆర్థిక క్రమశిక్షణ లేదని కాగ్ నివేదికతో తేటతెల్లమైందన్నారు. గడిచిన ఏడు నెలల్లో సంక్షేమాన్ని అందుకున్న ఒక్క లబ్ధిదారుడిని అయినా చూపించగలరా అని ప్రశ్నించారు. ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా కూటమి పాలకులు వైఖరి మార్చుకుని ఎన్నికల హామీలు పూర్తిగా నెరవేర్చాలని డిమాండ్ చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

ఘనంగా ఇందిర మహిళా మండలి వార్షికోత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక రామకృష్ణాపురంలో ఆదివారం ఇందిర మహిళా మండలి వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. 30వ డివిజన్ కార్పొరేటర్ బీ జానారెడ్డి, లయన్స్ ఏపీ చైర్‌పర్సన్ దామర్ల శ్రీశాంతి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. మహిళాభివృద్ధికి ఇందిర మహిళ మండలి చేస్తున్న సేవలను కొనియాడారు. ఇందిర మహిళా మండలి అధ్యక్షురాలు మాధవీలత మాట్లాడుతూ మహిళా మండలి వార్షికోత్సవాల్లో భాగంగా మహిళలకు 16 విభాగాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నామని తెలిపారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. లయన్స్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రామారావు, మహిళ మండలి ప్రధాన కార్యదర్శి వీఎస్‌ఎం లక్ష్మి, కోశాధికారి ఆర్‌వీటీ రత్నం, మహిళలు పాల్గొన్నారు.

20, 21 తేదీల్లో విప్లవ విద్యార్థి ఉద్యమంపై సదస్సు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వచ్చేనెల 20, 21వ తేదీల్లో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం'పై సదస్సు నిర్వహించనున్నట్లు ఆర్‌ఎస్‌యూ పూర్వ విద్యార్థి జర్నలిస్ట్ ఆర్.భరద్వాజ తెలిపారు. గాంధీనగర్ స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక త్యాగాలతో సాగిన విప్లవ విద్యార్థి ఉద్యమం గురించి నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నెల్లూరు రాజశేఖర్, ఏలూరి అజిత, విశాఖ పద్మ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

భవానీపురం(విజయవాడపశ్చిమ): వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ (గొల్లపూడి) ఆధ్వర్యంలో ఆదివారం గొల్లపూడిలోని ఎస్‌పీఎస్‌ఆర్‌సీ ప్రభుత్వ హైస్కూల్‌లో 'మేథ'- 2025 పేరుతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్, వ్యాసరచన, కథల పోటీలలో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. క్విజ్ పోటీలో మంగళగిరి అరవింద మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం, విజయవాడ వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్, నందిగామ శ్రీవిద్య హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వ్యాసరచన పోటీల్లో విజయవాడ వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని వైపీ సాయి సృజని, నందిగామ శ్రీవిద్య హైస్కూల్ విద్యార్థిని ఎస్ ప్రజ్ఞ, గుంటుపల్లి సెయింట్ ఆన్స్ హైస్కూల్ విద్యార్థిని ఎం శ్రేష్ఠ, వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. కథలు చెప్పే పోటీలో నిడమానూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని పి.చరిత, జీవజీ ఇంటర్నేషనల్ స్కూల్(గొల్లపూడి) విద్యార్థి జితేష్ మొదటి స్థానాన్ని పంచుకున్నారు. అలాగే ద్వితీయ స్థానాన్ని కొండపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కె.హారిక, వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని పి.శ్రియ పంచుకున్నారు. తృతీయ స్థానాన్ని మంగళగిరి అరవింద మోడల్ స్కూల్ విద్యార్థి ఎస్‌కే గౌస్ బాషా దక్కించుకున్నాడు. వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ పోటీలకు ఆలిండియా రేడియో విశ్రాంత డైరెక్టర్ ముంజులూరి కృష్ణకుమారి, సాహితీ విమర్శకులు బాలాంత్రపు ప్రసూన న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.



విజేతలతో నిర్వాహకులు, న్యాయనిర్ణేతలు

దుర్గమ్మ కొండపై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులతో ఆలయ ప్రాంగణంలో సందడి వాతావరణం కనిపించింది. ఆదివారం ఉదయం నుంచే ప్రారంభమైన భక్తుల రద్దీ మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు కొనసాగింది. మరో వైపున ఆది దంపతులకు నిర్వహించిన పలు అర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీహోమంలో ఉభయదాతలు పాల్గొని తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. మహా మండపం, ఘాట్‌రోడ్డు మీదగా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వదర్శనం, రూ. 100, రూ.300, రూ. 500 టికెట్ క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు మధ్యాహ్నం 12 గంటలకు అన్ని దర్శనాలు నిలిపివేశారు. మహా నివేదన అనంతరం 12.20 గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభం కాగా, మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు రద్దీ కొనసాగింది. భక్తులకు త్వరితగతిన అమ్మవారి దర్శనం అయ్యేలా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఏఈవో, సూపరింటెండెంట్‌లు క్యూలైన్లను పర్యవేక్షిస్తూ భక్తులకు ప్రశాంత వాతావరణంలో అమ్మవారి దర్శనం జరిగేలా చూశారు. సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన పంచహారతుల సేవలో పలువురు భక్తులు పాల్గొని తరించారు.



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

విజయవాడ కల్చరల్: దృశ్య వేదిక ఆధ్వర్యంలో నెలవారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భారతీయ భారతీ నృత్యాలయం వ్యవస్థాపకురాలు లేఖ్యాభరణి ఆధ్వర్యంలో కళాకారులు నృత్యాలను ప్రదర్శించారు. అలాగే రసరంజని హైదరాబాద్ ఆధ్వర్యాన రెపర్టరీ ప్రొడక్షన్ నిర్వహణలో దేవుడు చేసిన బొమ్మలు సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. రచన వాసా శైలజామూర్తి, దర్శకత్వం మోహన్ సేనాపతి. అనంతరం నాటక ప్రయోక్త, సాంస్కృతిక సంస్థల నిర్వాహకుడు పసుమర్తి భాస్కరశర్మకు ఓరుగంటి ప్రభాకర్ స్మారక పురస్కారం ప్రదానం చేశారు. దృశ్యవేదిక అధ్యక్షుడు మాజేటి రవీంద్రనాథ్, హ్యాపీ రిసార్ట్స్ అధినేత అంబటి మధుమోహన కృష్ణ, డీ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ కైలాసరావు, నందివాడ నాని, బోడి ఆంజనేయరాజు పాల్గొన్నారు.



నృత్యాలు ప్రదర్శిస్తున్న కళాకారులు